AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

ఎల్లారెడ్డిలో పోలీసుల తనిఖీలు

2

3

జోరుగా ప్రచారం

ఏడో డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

అక్షరటుడే, ఇందూరు : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఏడో డివిజన్‌ను అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థి రామర్తి గోపి అన్నారు. ఈ మేరకు బుధవారం డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని పలు కాలనీల్లో రామర్తి గోపి ఇంటింటికి ప్రచారం చేశారు.

కామారెడ్డి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ప్రధాన పార్టీల మధ్య ఈ సారి గట్టి పోటీ నెలకొంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అడుగుతున్నారు. దీంతో ఈసారి ఎన్నికలు రసవత్తరంగా సాగనున్నాయి.

- అక్షరటుడే, కామారెడ్డి

పురపోరుకు సై

- వార్డుల్లో జోరందుకున్న ప్రచారం
- సొంత మేనిఫెస్టో, సమస్యల పరిష్కారంపై హామీలు
- ప్రతి ఇంటి తలుపు తడుతున్న అభ్యర్థులు

జిల్లాలోని 92 వార్డులలో మొత్తం 447 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. కామారెడ్డి మున్సిపాలిటీలో 49 వార్డుల్లో ప్రధాన పార్టీల నుంచి 145 మంది పోటీ చేస్తున్నారు. ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కలిపి మొత్తం 254 మంది పోటీలో ఉన్నారు. ఎల్లారెడ్డి మున్సిపాలోటీలో 19 వార్డులలో 45 మంది, బాన్సువాడలో 85 మంది, బిచ్కుందలో 63 మంది అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ సారి స్వతంత్ర అభ్యర్థులు అధికంగా పోటీలో ఉన్నారు. ఇందులో ఆయా పార్టీల నుంచి టికెట్ ఆశించి రెబల్‌గా పోటీ చేస్తున్న వారే అధికంగా ఉన్నారు.

ఇంటింటికీ తిరుగుతూ..

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఇంటింటికీ తిరుగుతున్నారు. సమయం తక్కువగా ఉండటంతో ఉదయం నుంచి రాత్రి వరకు వార్డుల్లోనే ఉంటున్నారు. కుల సంఘాలు, కాలనీల పెద్దలను కలుస్తూ ప్రసన్నం చేసుకుంటున్నారు. మరోవైపు డోర్ టూ డోర్ క్యాంపెయిన్ చేస్తున్నారు. తమను గెలిపించాలని వేడుకుంటున్నారు. దీంతో పట్టణాల్లో సందడి నెలకొంది.

పనులు చేస్తాం

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఈసారి గతానికి భిన్నంగా ముందుకు సాగుతున్నారు. రాజకీయ పార్టీలు ఇస్తున్న హామీ మాదిరిగా కౌన్సిలర్ అభ్యర్థులు తాము గెలిస్తే ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో పాటు సొంత డబ్బులతో చేపట్టబోయే పనులను ప్రత్యేకంగా మేనిఫెస్టోలో పొందుపరిచి ప్రజలకు వివరిస్తున్నారు. మేనిఫెస్టో ప్రతులను ఇంటింటికి పంచుతున్నారు. తాము గెలిస్తే సొంత డబ్బులతో పలు నా పనులు చేస్తామని హామీలు ఇస్తున్నారు. అలాగే ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని చెబుతున్నారు.

ప్రచారం ప్రారంభించిన ఎమ్మెల్యే

కామారెడ్డి మున్సిపాలిటీలో 49 వార్డుల్లో 48 మందిని బీజేపీ బరిలో ఉంచింది. ఈసారి కామారెడ్డిలో పట్టు నిలుపుకునేందుకు ప్రయత్నిస్తోంది. బుధవారం క్యాంపు కార్యాలయంలో తన ప్రచార రథానికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి వార్డుల్లో ప్రచారాన్ని ప్రారంభించారు. అవినీతి లేని కామారెడ్డిగా మార్చేందుకు ఈసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

ప్రమాణం చేయించిన మాజీ ఎమ్మెల్యే

బీఆర్ఎస్ సైతం 48 వార్డుల్లో అభ్యర్థులను బరిలో నిలిపింది. ఈసారి కూడా మున్సిపాలిటీ కైవసం చేసు కునేందుకు ఆ పార్టీ నేతలు ప్రణాళికలు రచిస్తున్నారు. బీఫాం ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అభ్యర్థు లతో ప్రమాణం చేయించారు. పార్టీ నియమాలను ఉల్లంఘించమని, మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామని అభ్యర్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి పనులను వివరిస్తూ ఓట్లు అడుగుతోంది. ఇటీవల కామారెడ్డి మున్సిపాలిటీకి ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో పనులను ప్రారంభించారు. దాంతో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రజలకు అభివృద్ధి పనులను వివరిస్తున్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని హామీ ఇస్తున్నారు.

నాయకుల దిశానిర్దేశం

ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి బీఫారం అందుకున్న అభ్యర్థులకు నాయకులు దిశానిర్దేశం చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులు గతంలో చేసిన పనులు వివరిస్తూ.. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతున్నారు. బీజేపీ కేంద్రంలోని మోదీ చరిష్మాను నమ్ముకుంది. మరోవైపు స్థానిక కార్యకర్తలు సైతం తీవ్రంగా కష్టపడుతున్నారు. తమకు ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. అభ్యర్థులకు ఆయా పార్టీల ఎమ్మెల్యేలు, ఎన్నికల ఇన్ ఛార్జీలు సూచనలు చేస్తున్నారు.

అవినీతి రహితపాలన బీజేపీతోనే సాధ్యం: ఎమ్మెల్యే

అక్షరటుడే, కామారెడ్డి: అవినీతి రహిత మున్సిపాలిటీ బీజేపీతోనే సాధ్యమని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల కోసం బుధవారం ప్రచార రథానికి క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో బీజేపీ అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించే వారినే కౌన్సిలర్‌గా గెలిపించాలన్నారు. జరగబోయే ఎన్నికల్లో నీతి, నిజాయితీగా పనిచేసే వారికి ఓటు వేసి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఎల్లారెడ్డి అభివృద్ధే లక్ష్యం

అక్షరటుడే, ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నానని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని పలు వార్డుల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధునిక సౌకర్యాలతో నూతన బస్టాండ్ నిర్మాణాన్ని పూర్తి చేశామన్నారు. ప్రజలకు విశ్రాంతి, వినోదం కల్పించేలా మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి చేశామని తెలిపారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు చేపట్టి మౌలిక వసతులు మెరుగుపడేలా కృషి చేశామని వివరించారు. 300 డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందించామన్నారు. అమృత్ పథకం ద్వారా ఇంటింటికి తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం: బిగాల

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా బుధవారం ఆయన వర్ని చౌరస్తా ప్రాంతంలో ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. రాష్ట్రంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమని బిగాల అన్నారు. నగరం అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. దేవుడు అందరికి ఉన్నాడని ఆయన పేర్కొన్నారు. రాముడు కేవలం బీజేపీకి దేవుడు కాదన్నారు. తాము కూడా పూజలు చేస్తామన్నారు. దేవుడు పేరు చెప్పి ఓట్లు అడగడం బీజేపీకి అలవాటు అయిందని విమర్శించారు. బీజేపీ నిజామాబాద్ పేరు మారిస్తే మన బతుకులు మారవని బిగాల అన్నారు. తాము గెలిస్తే నిజామాబాద్ పేరును ఇందూరుగా మారుస్తామని ఎంపీ అర్వింద్ చెప్పిన విషయం తెలిసిందే. దీనిపై బిగాల స్పందించారు. నగర ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అభివృద్ధి చేయడంలో విఫలం అయ్యారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

అక్షరటుడే, ఇందూరు: మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయాన్ని సందర్శించి డిస్ట్రిబ్యూషన్ పోలింగ్ ఏర్పాట్ల గురించి కమిషనర్ దిలీప్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో బ్యాలెట్ పేపర్లు పోస్టల్ బ్యాలెట్ ముద్రణ గురించి ఆరా తీశారు. గోప్యతను పాటిస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ముద్రణ జరిపించాలని, పోలీసు భద్రత మధ్య స్ట్రాంగ్ రూములకు తరలించి జాగ్రత్తగా భద్రపరచాలని ఆదేశించారు. బ్యాలెట్ పత్రాల ముద్రణ పూర్తయిన తర్వాత వివరాలు ఎక్కడ కూడా బయటకు వెల్లడికాకుండా చూడాలన్నారు. ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు ముద్రణానంతరం సాఫ్ట్ కాపీలను పూర్తిస్థాయిలో హార్డ్‌డిస్క్ నుంచి తొలగించేలా పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఎన్నికల సంఘం క్రిమినల్ చర్యలు చేపడుతుందని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల పరిధిలో పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ జరిపిస్తున్నట్లు వెల్లడించారు. పోలింగ్ ముగిసిన వెంటనే గట్టి బందోబస్తు మధ్య బ్యాలెట్ బాక్స్‌ను కౌంటింగ్ సెంటర్‌కు తరలించేలా తగిన ఏర్పాటు చేయాలని సూచించారు. సమీక్షలో డీఆర్డీవో సాయా గౌడ్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చును పక్కాగా నమోదు చేయాలి: అదనపు కలెక్టర్

అక్షరటుడే, కామారెడ్డి: మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల ఖర్చులను పక్కాగా నమోదు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుమోహన్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో బుధవారం కౌన్సిలర్ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసిన తేదీ నుంచి ఫలితాలు ప్రకటించే వరకు చేసిన ఎన్నికల ఖర్చులన్నింటినీ ప్రతిరోజూ కచ్చితంగా లెక్కల్లో నమోదు చేయాలని సూచించారు. రిటర్నింగ్ అధికారి అందజేసిన ఖర్చుల రిజిస్టర్‌లో బిల్లులు, వోచర్లు, రశీదులతో సహా నమోదు చేయాలన్నారు. నిర్ణీత తేదీల్లో ఖర్చుల ఖాతాలను వ్యయ పరిశీలకుడు లేదా అధీకృత అధికారికి తనిఖీ కోసం సమర్పించాలని పేర్కొన్నారు. ప్రచారం కోసం వాహనాల వినియోగం, లౌడ్ స్పీకర్ల ఏర్పాటు, బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షోలు, ఊరేగింపులు నిర్వహించేందుకు ముందస్తుగా రిటర్నింగ్ అధికారి లేదా సహాయ రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా వాహనాలు, లౌడ్ స్పీకర్లు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎన్నికల ఏజెంట్, పోలింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లను నిర్ణీత ఫార్మాట్లలో నియమించుకుని, రిటర్నింగ్ అధికారి ఆమోదం పొందిన తర్వాత మాత్రమే విధులు నిర్వహించాలని తెలిపారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు సమయంలో అధికారులు జారీ చేసే సూచనలు, ప్రవర్తనా నియమావళిని పాటించాలని సూచించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఫలితాలు ప్రకటించిన తర్వాత వ్యవధిలోపు ఎన్నికల వ్యయ ఖాతాల తుది లెక్కలను సమర్పించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, ఎన్నికల అధికారులు, కౌన్సిలర్ అభ్యర్థులు పాల్గొన్నారు.

వారిని గెలిపిస్తే నగరాన్ని దోపిడీ చేస్తారు..: ఎంపీ అర్వింద్

అక్షరటుడే, ఇందూరు: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఓ కాంగ్రెస్ అభ్యర్థిపై ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వారిని గెలిపిస్తే నగరాన్ని దోచుకుంటారన్నారు. బుధవారం పార్టీ కార్యాలయం లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికలప్పుడు బీజేపీకి హిందుత్వం, ఇందూరు గుర్తుకు వస్తాయని కాంగ్రెస్ విమర్శలు చేస్తోంది. దీనికి ఎంపీ అర్వింద్ కౌంటర్ ఇచ్చారు. హిందుత్వం తమ డీఎన్ఏ అన్నారు. అది తమ జీవన విధానమని చెప్పారు. హిందుత్వం కోసం తాము రాజకీయాలు చేయమన్నారు. కాంగ్రెస్ అవినీతి కోసం రాజకీయాలు చేస్తోందన్నారు. నిజామాబాద్ కాంగ్రెస్ లో పరిణితి చెందిన నాయకుడు ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ మేయర్ అభ్యర్థి ఎవరని అర్వింద్ ప్రశ్నించారు. కాంగ్రెస్ మేయర్ అభ్యర్థి శమంత నరేందర్ రెడ్డి అని ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. దీనిపై స్పందిస్తూ.. 2009 నుంచి ఓ భవనానికి సంబంధించిన భారీ ఆస్తి పన్నును నరేందర్‌రెడ్డి కట్టలేదన్నారు. రూ.8.16 కోట్ల ఆస్తి పన్ను ఇన్ని రోజులు కట్టించేవారు లేరా అని ప్రశ్నించారు. ఎన్నికల కోసం ఆ బకాయిలు కట్టారన్నారు. మున్సిపల్ అధికారులను మేనేజ్ చేసుకుంటూ ఇన్ని రోజులు పన్ను కట్టలేదని విమర్శించారు. ఆయన ఇన్ని రోజులు పైసలు లేక కాదని నిజాయితీ లేక డబ్బులు కట్టలేదన్నారు. ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేయడానికి ఒకేసారి రూ.8.16 కోట్ల బకాయిలు చెల్లించారన్నారు. అంత డబ్బు ఒకేసారి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. అలాంటి వారు నగర మేయర్ అయితే నిలువు దోపిడీ చేస్తారని ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి 17 ఏళ్లుగా కట్టని బకాయిలను 17 గంటల్లో ఎలా కట్టారని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధిష్టానంతో మేయర్ పదవిపై డీల్ మాట్లాడుకొని పన్ను కట్టారని విమర్శించారు.

'లయన్స్' సహకారంతో శవపేటిక అందజేత

అక్షరటుడే, కోటగిరి: మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ కోటగిరి ఆధ్వర్యంలో రంజని రిక్రియేషన్ క్లబ్‌కు బుధవారం శవ పేటికను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్లబ్ కోటగిరి అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అవసరమైన సమయంలో ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రంజని రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు కొల్లూర్ కిషోర్, నార్ల శ్రీనివాస్ రావు, హన్మంత్ రావు, అనిల్ కుమార్, ఉదయ్, కూచి సిద్ధు, షాజీ పటేల్, కిష్టయ్యతో పాటు లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట మున్నూరు కాపు సంఘం కార్యవర్గం ఎన్నిక

అక్షరటుడే, లింగంపేట: మండల మున్నూరు కాపు సంఘం కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో సంఘ అధ్యక్షుడిగా చేపూరి పోశెట్టి, ఉపాధ్యక్షుడిగా శిలమంతుల నరేష్, కోశాధికారిగా బర్ల చందు, కార్యదర్శులుగా ఆకుల ఆనంద్, ఆవుల మనోహర్, ఆకుల సత్యం, గుండ ప్రభాకర్లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లింగంపేట మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు గుండా బాలకిషన్‌పాటు సంఘ సభ్యులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

42వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తాం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: తనను గెలిపిస్తే 42వ డివిజన్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి కేశ మహేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం కంఠేశ్వర్‌లో ప్రచారం నిర్వహించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ సహకారంతో 42వ వార్డు అభివృద్ధికి శాయశక్తులా పనిచేస్తానని కేశ మహేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో మాట్లాడారు. ఓట్లను అభ్యర్థించారు. అభివృద్ధి చేసే పార్టీకే పట్టం కట్టాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున డివిజన్‌లోనూ అధికార పార్టీ అభ్యర్థి ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుందని ప్రజలకు వివరించారు. ప్రజలు సైతం తమ వెంట ఉండే అభ్యర్థినే గెలిపించుకోవాలని కోరారు.

ఎల్లారెడ్డి బల్దియాపై పాగా వేయాలని..

ఎల్లారెడ్డి మున్సిపాలిటీగా మారిన తర్వాత రెండోసారి ఎన్నికలు జరుగుతున్నాయి. ఈక్రమంలో రెండోసారి ఎలాగైనా మున్సిపాలిటీపై జెండా ఎగరేయాలని ప్రధాన పార్టీలన్నీ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాయి. ఈ క్రమంలో సమర్థులైన అభ్యర్థులను నిలబెట్టి రంగంలోకి దిగాయి. వాడవాడలా ప్రచారాన్ని ప్రారంభించాయి. ఓటర్లు ఏ పార్టీకి మద్దతు తెలిపి చైర్మన్‌గిరీ అప్పగిస్తారో వేచి చూడాల్సిందే.

– అక్షరటుడే,ఎల్లారెడ్డి

- కసరత్తు చేస్తున్న ప్రధాన పార్టీలు
- రెండోసారి బల్దియాకు ఎన్నికలు
- ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నాలు

ఎల్లారెడ్డి 2018లో మున్సిపాలిటీగా అవతరించింది. 2020 డిసెంబర్‌లో మొట్టమొదటి సారిగా ఎన్నికలు జరిగాయి. 2021 జనవరి 21న కొత్త పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. బీఆర్ఎస్ నుంచి కుడుముల సత్యనారాయణ చైర్మన్‌గా నాలుగున్నర ఏళ్ల వరకు పదవిలో ఉన్నారు. తదుపరి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో మాజీ ఎమ్మెల్యే నళ్లమడుగు సురేందర్ అయన అనుచరులతో చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఈ విషయమై కోర్టులో కేసు వేయడంతో రెండునెలల వరకు కొత్త చైర్మన్ ఎన్నికలు నిలిచాయి. దీంతో మిగితా వార్డ్ కౌన్సిలర్స్ కాంగ్రెస్ ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. మున్సిపాలిటీ రెండో చైర్మన్‌గా పద్మ శ్రీకాంత్ బాధ్యతలు తీసుకున్నారు. నాలుగు నెలల పాటు చైర్మన్‌గా ఆయన కొనసాగారు. జనవరి 2025 పాలక వర్గం పదవీకాలం పూర్తికావడంతో ఎల్లారెడ్డి మున్సిపాలిటీకి రెండోసారి ఎన్నికలు రానున్నాయి.

మున్సిపాలిటీ భౌగోళిక స్వరూపం

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ 2018లో ఆవిర్భవించింది. ఎల్లారెడ్డి పట్టణంతో పాటు గండి మాసానిపేట, బాలాజీ నగర్ తండా, కొత్తపల్లి, చతుర్ నాయక్ తండా, లింగారెడ్డి పేట్, హౌసింగ్ బోర్డ్‌లతో విలీనం చేశారు. దీంతో కొత్త మున్సిపాలిటీగా అవతరించింది. 1960లో మున్సిపాలిటీగా ఉన్న ఎల్లారెడ్డి గ్రామపంచాయతీగా మారింది. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లారెడ్డిని 2018లో 12 వార్డులతో మున్సిపాలిటీగా ప్రకటించింది. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ లో 19,750 మంది జనాభా ఉన్నారు. 13,265 మంది ఓటర్లు ఉండగా. అందులో 6,321 మంది పురుషులు 6,943 మంది మహిళలు ఉన్నారు.

ఆధిపత్యం కోసం కాంగ్రెస్..

మున్సిపాలిటీపై కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేసేందుకు ఎమ్మెల్యే మదన్‌మోహన్ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. 12 వార్డులను కైవసం చేసుకుని బల్దియాపై జెండా ఎగరేసేందుకు చూస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు వివరిస్తూ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేస్తున్నారు. దాంతోపాటు గత పాలకులు చేయలేని పనులను కొత్తగా వచ్చిన ఎమ్మెల్యే మదన్ మోహన్ పూర్తిస్థాయిలో నెరవేర్చడంలో సఫలీకృతులయ్యారు. ఎల్లారెడ్డి సుందరీకరణలో భాగంగా ఎల్లారెడ్డి పెద్ద చెరువు అభివృద్ధి, పట్టణంలో డ్రెయినేజీలు, సీసీరోడ్లు, కొత్త ఐటీఐ నిర్మాణం చేపట్టడం వంటి కార్యక్రమాలతో ప్రజలలో తమకు మంచిపేరు వచ్చిందని ఎన్నికల్లో తమ గెలుపు ఖాయమని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.

ఉనికి చాటుకునేందుకు బీజేపీ ప్రయత్నం

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ బరిలో తమ ఉనికిని చాటుకునేందుకు 12వార్డుల్లో బీజేపీ తమ అభ్యర్థులను నిలిపింది. తమ ఉనికిని చాటుకునేందుకు కొన్ని వార్డుల్లోనైనా గెలుపొందాలని లక్ష్యంతో ప్రణాళికలు చేస్తున్నారు. ఎమ్మెల్సీలు, బీజేపీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర నాయకులు ఎల్లారెడ్డి పట్టణంపై ప్రత్యేక దృష్టి సారించి తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రణాళికలు వేస్తున్నారు.

పట్టుకోసం బీఆర్ఎస్ ప్రయత్నం..

మున్సిపాలిటీలో తమ పట్టును మరోసారి నిలుపుకునేందుకు మాజీ ఎమ్మెల్యే నల్లమడుగు సురేందర్ పావులు కదుపుతున్నారు. తమకు అనుకూలంగా ఉన్న వార్డుల్లో బలమైన అభ్యర్థులను బరిలో దింపారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. బరిలో ఉన్న అభ్యర్థులను సైతం క్యాంప్‌నకు తరలించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు చిక్కకుండా ప్రయత్నాలు చేశారు. మొదటి చైర్మన్‌గా తామే నిలిచామని.. రెండోసారి కూడా పట్టు సాధించి మున్సిపల్ పీఠంపై పాగా వేయాలని ఆలోచనతో ముందుకు సాగుతున్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

అక్షరటుడే, లింగంపేట : మండలంలోని మోతె ఆరోగ్య ఉప కేంద్రంలో బుధవారం రోగులకు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిని హిమబిందు మాట్లాడుతూ క్యాన్సర్ ఏ విధంగా సోకుతుంది.. దాని లక్షణాలను ముందే కనుక్కొనే అంశాలను వివరించారు. ముందే క్యాన్సర్‌ను పసిగడితే చికిత్సకు మార్గాలున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సీహెచ్‌వో ఠాగూర్, గోవింద్ రెడ్డి, ఏఎన్ఎం రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో వందేమాతర గీతాన్ని ఆలపించిన స్పందనకు సన్మానం

అక్షరటుడే, ఆర్మూర్: ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన మహిళా సంఘం ఆర్మూర్ అధ్యక్షురాలు స్పందనను గ్రామ సర్పంచ్ కట్ట నర్సయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ వేదికపై వందేమాతర గీతాన్ని ఆలపించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కట్ట నర్సయ్య మాట్లాడుతూ.. ఢిల్లీలో రిపబ్లిక్‌డే సందర్భంగా తెలంగాణ రాష్ట్రం నుంచి కేవలం ఇద్దరు మహిళలకు మాత్రమే వందేమాతరం గీతం ఆలపించే అవకాశం వచ్చిందన్నారు. అందులో మచ్చర్ల గ్రామానికి చెందిన స్పందనకు అవకాశం రావడం గ్రామానికి గర్వకారణమన్నారు. జాతీయ వేదికపై మచర్ల గ్రామానికి చెందిన స్పందన తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడం గొప్పవిషయమన్నారు. జాతీయస్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న స్పందన మచ్చర్ల గ్రామానికి గొప్పపేరు తీసుకొచ్చిందని సర్పంచ్ అన్నారు. భవిష్యత్‌లో మరింత మంది మహిళలు ఇలాంటి ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీఎం భూమేశ్వర్, పంచాయతీ కార్యదర్శి నసీర్, మహిళా సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు స్పందనను సన్మానించారు.

నర్సరీలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

అక్షర టుడే, ఆర్మూర్: ఆలూర్ మండల కేంద్రంలోని గగ్గుపల్లిలో ఎంపీడీవో గంగాధర్ నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీల్లో మొక్కల పెంపకం, సంరక్షణ, నీటి సౌకర్యాలు, నిర్వహణ విధానాలను ఆయన సమగ్రంగా పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం గగ్గుపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో పరిశీలించారు. పనులు వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని లబ్ధిదారులు, అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టి, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. తదుపరి గగ్గుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామానికి సంబంధించిన వివిధ రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, అభివృద్ధి పనులను నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాజలింగం, కిషోర్, ఆలూర్ సర్పంచ్ ముక్కెర విజయ్, గగ్గుపల్లి సర్పంచ్ కొండ్ర నడిపి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో విజయవంతంగా బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్

అక్షరటుడే, ఎల్లారెడ్డి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎల్లారెడ్డిలో 'మేరా యువ భారత్' సంస్థ ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ -2026ను విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ క్రీడా పోటీలను ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని, కష్టపడి చదువుతూ ఉన్నత స్థానాల్లో నిలవాలని సూచించారు. యువత క్రీడల్లో పాల్గొంటే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని, అప్పుడు దేశం కూడా ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సునీల్ రాథోడ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువతలో క్రీడానైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'మేరా యువ భారత్' ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌లను నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ శంకరయ్య, టీఎస్‌కేసీ కో-ఆర్డినేటర్, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి శివకుమార్, స్పోర్ట్స్ కమిటీ సభ్యుడు కృష్ణ ప్రసాద్, అధ్యాపక బృందం ఏ. ప్రభాకరరావు, అరుణ్ కుమార్, నాగనిక, గంగారెడ్డి, సిద్ధు రాజు, గోదావరి, రాణి, సంతోష్, చంద్రకాంత్, శశిధర్, సంగీత, కీర్తి, స్వప్న, సురేష్ రెడ్డి, మోహన్, దశరథ్, కళాశాల సూపరింటెండెంట్ వసంతలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాన్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సత్యం

అక్షరటుడే, గాంధారి: తెలంగాణ రాష్ట్ర సోషల్ వర్క్ యాక్టివిటీస్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా (స్వాన్ ఇండియా) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డాక్టర్ పీబీ సత్యం నిమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగెల శ్రావణ్ గౌడ్ ప్రకటించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను రాష్ట్ర నాయకత్వ బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. రాబోవు కాలంలో రాష్ట్ర సోషల్ వర్క్ విద్యను అభ్యసించిన నిరుద్యోగాల సమస్యల పరిష్కారానికి, ఉపాధి ఉద్యోగావకాశాల కోసం పోరాటం చేస్తానన్నారు. నియామకానికి సహకరించిన స్వాన్ ఇండియా గౌరవాధ్యక్షుడు డాక్టర్. ఎం.విజయ్ కుమార్ శర్మ, రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్లారెడ్డిలో పోలీసుల తనిఖీలు.. ఎన్నికల వేళ కట్టుదిట్టమైన నిఘా



అక్షరటుడే, ఎల్లారెడ్డి : మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎల్లారెడ్డిలో పోలీసులు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశారు. ఎస్సై సుబ్రహ్మణ్యాచారి ఆధ్వర్యంలో సివిల్, ఏఆర్ ప్రత్యేక బృందాల సమన్వయంతో మినీ ట్యాంక్‌బండ్ వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అక్రమమద్యం, అనుమానాస్పద నగదు రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై కఠినచర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. అదే సమయంలో హెల్మెట్, సీట్‌బెల్ట్ లేకుండా ప్రయాణించే వాహనదారులకు హెచ్చరికలు జారీ చేస్తూ, రోడ్డు భద్రతపై పోలీసులు అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఈ తనిఖీలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. ఎన్నికలు శాంతియుతంగా సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

అనారోగ్యంతో ఒకరి బలవన్మరణం

అక్షరటుడే, ఎల్లారెడ్డి: అనారోగ్యంతో బాధపడుతూ ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఎల్లారెడ్డి మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని వడ్డెర కాలనీకి చెందిన గండికోట మల్లేష్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆరోగ్యం మెరుగు పడకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 3వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఆయన తండ్రి గండికోట ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కూతురిని హత్య చేసిన నిందితుడికి జీవితఖైదు

అక్షరటుడే, మెండోరా: కూతురిని హత్య చేసిన వ్యక్తికి న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. ఇందుకు సంబంధించిన వివరాలను మెండోరా ఎస్సై సుహాసిని వెల్లడించారు. మెండోరా మండలంలోని బుస్సాపూర్ గ్రామంలో కడమంచి కాశీరాం అనే వ్యక్తి తన కూతురిని హత్య చేసిన కేసులో అతడిపై 2023లో కేసు నమోదైంది. దీంతో పోలీసులు దర్యాప్తు చేపట్టి ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రభుత్వ న్యాయవాదులు బి.వసంత్, ఆర్.దయాకర్ గౌడ్ కోర్టులో సాక్ష్యాలను ప్రవేశపెట్టారు. పరిశీలించిన నిజామాబాద్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ నిందితుడికి ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం జీవిత ఖైదుతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. కోర్టులో సాక్ష్యాల సమర్పణలో సహకరించిన కోర్టు డ్యూటీ అధికారి ఎస్.రాజును మెండోరా ఎస్సై సుహాసిని అభినందించారు.

24వ డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి

అక్షరటుడే, ఇందూరు : తనను గెలిపిస్తే 24వ డివిజన్ వాసులకు అండగా నిలిచి, డివిజన్‌ను అభివృద్ధి చేస్తానని బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థిని ఇప్పకాయల సుమిత్రా కిషోర్ హామీ ఇచ్చారు. డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో బుధవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలోనూ డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేశామని తెలిపారు. పలు కాలనీల్లో తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, పారిశుధ్యం వంటి సమస్యలను పరిష్కరించామని వివరించారు. భవిష్యత్తులో కూడా ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తామని స్పష్టం చేశారు. ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా సహకారంతో డివిజన్‌ను మరింత అభివృద్ధి చేస్తామని ఆమె పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని సుమిత్రా కిషోర్ వివరించారు. ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన ద్వారా పేదలకు శాశ్వత గృహాలు, ఉజ్వల యోజన కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సౌకర్యం అందుతోందని చెప్పారు. అలాగే స్వచ్ఛ భారత్ అభియాన్ ద్వారా పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన పెరిగిందని, జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. మహిళల సాధికారత కోసం ముద్ర యోజన ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు, వృద్ధులకు పెన్షన్ పథకాలు, రైతులకు పీఎం కిసాన్ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందుతోందని వివరించారు. డివిజన్‌లో తనకు మంచి స్పందన లభిస్తోందని, ప్రజలు బీజేపీ పాలనపై విశ్వాసంతో ఉన్నారని సుమిత్రా కిషోర్ తెలిపారు. డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ప్రజల ఆశీర్వాదంతో గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 24వ డివిజన్‌ను అభివృద్ధిలో ముందంజలో నిలిపేలా శాయాశక్తులా కృషి చేస్తానని ఆమె అన్నారు. ఆమె వెంట పలువురు కార్యకర్తలు ఉన్నారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

అక్షరటుడే, ఎల్లారెడ్డి: మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులుతో కలిసి ఎల్లారెడ్డి పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బాణాల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎల్లారెడ్డి మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగరేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. అభ్యర్థులు సైతం ప్రజల్లోకి వెళ్లి పీఎం నరేంద్ర మోదీ నాయకత్వాన్ని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ఓట్లు అడగాలన్నారు. ఎల్లారెడ్డిలో బీజేపీ నిలువాలంటే సమష్టి కృషితోనే సాధ్యమని బాణాల అన్నారు. గెలుపే లక్ష్యంగా ప్రతి వార్డులో పార్టీ శ్రేణులు ముమ్మరంగా ప్రచారం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి రాంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు, అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, కిసాన్ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు పొతంగల్ కిషన్ రావు, సీనియర్ నాయకులు పాటిమీద గంగారెడ్డి, మహారాజుల మురళి, ఎల్లారెడ్డి మాజీ సర్పంచ్ దేవేందర్, ఎల్లారెడ్డి, గాంధారి మండలాల అధ్యక్షులు నర్సింలు, మధుసూదన్, ఎల్లారెడ్డి పట్టణ అధ్యక్షుడు రాజేష్, గాంధారి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట మండలాల మాజీ అధ్యక్షులు సాయిబాబా, ఎస్.ఎన్. రెడ్డి, హన్మాండ్లు, దత్తురాం, ఎల్లారెడ్డి మాజీ పట్టణ అధ్యక్షుడు సతీష్, సీనియర్ నాయకులు హోటల్ శీను, కిష్టయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో జోరందుకున్న ప్రచారం..

అక్షరటుడే, ఆర్మూర్: పట్టణంలో మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ప్రచారం జోరందుకుంది. అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీల ముఖ్య నేతలు రంగంలోకి దిగారు. బుధవారం పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో జోరుగా ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత పాలనను ఎండగడుతూ.. తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆర్మూర్‌లో చేసిన అభివృద్ధి పనులను, కాంగ్రెస్ పాలనలో అవినీతి ఆక్రమాలను ప్రజలకు వివరిస్తూ తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అధికార కాంగ్రెస్ తరపున ఆర్మూర్ నియోజకవర్గ ఇన్ ఛార్జి వినయ్ రెడ్డి సైతం దూకుడు పెంచారు. రెండేళ్లలో ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆర్మూర్ అభివృద్ధికి నోచుకోలేదని, ప్రస్తుత ఆర్మూర్ ఎమ్మెల్యే మాటలకే పరిమితమయ్యారంటూ బీజేపీ,బీఆర్ఎస్ నేతల తీరును ఎండగడుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఆర్మూర్ అభివృద్ధి కాంగ్రెస్‌కే సాధ్యమన్నారు.

కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించండి..

అక్షరటుడే, ఇందూరు: తనను గెలిపిస్తే 47వ డివిజన్‌ను శరవేగంగా అభివృద్ధి చేసి, పేదలకు అండగా నిలుస్తానని బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి దుద్దిళ్ల గిరిబాబు హామీ ఇచ్చారు. అంగడిబజార్‌లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దుద్దిళ్ల గిరిబాబు మాట్లాడుతూ.. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా కేంద్ర ప్రభుత్వ నిధులను సమర్థంగా వినియోగిస్తూ ప్రతి డివిజన్‌ను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నారని తెలిపారు. పారదర్శకమైన, అవినీతిరహిత పాలన కోసం బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు. 47వ డివిజన్‌లో ముఖ్యంగా డ్రెయినేజీ, రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని గిరిబాబు హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తానన్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్, ముద్ర యోజన వంటి పథకాలతో యువత, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ప్రజలకు వివరించారు. అలాగే 'మన ఇందూరు - మన మేయర్' నినాదంతో బీజేపీ అభ్యర్థులను ఆదరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా: నీలం కళావతి రమేష్

అక్షరటుడే, కామారెడ్డి : వార్డు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి 10వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థిని నీలం కళావతి రమేష్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆమె వార్డులో పర్యటించారు. వార్డులోని ఆయా కాలనీల్లో ఇంటింటికి తిరుగుతూ నీలం కళావతి రమేష్ ఓటును అభ్యర్థించారు. తనను గెలిపిస్తే చేయబోయే పనులను ఓటర్లకు వివరించారు. ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వార్డులో ప్రతి ఇంటికి తిరుగుతూ జోరుగా ప్రచారం నిర్వహించారు. వృద్ధులను, యువకులను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా కళావతి మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. తమ విలువైన ఓటును అభివృద్ధి చేసేవారికి వేయాలని కోరారు. తాను గెలిచాక యువత భవిష్యత్‌కు ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తానన్నారు. చదువుకునే విద్యార్థులకు బాసటగా నిలుస్తానని వివరించారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా తన సహకారం ఉంటుందని తెలిపారు. వార్డు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తానని చెప్పారు. ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా ప్రత్యేక చొరవ తీసుకుంటానని, అర్హులైన వారికి పింఛన్లు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. వార్డు ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తానని హామీ ఇచ్చారు.

41వ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తా..

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రచారం జోరుగా సాగుతోంది. అభ్యర్థులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా 41వ డివిజన్ బీజేపీ అభ్యర్థిని బూర్గుల ఇందిర వినోద్ ఇంటింటి ప్రచారం చేశారు. ప్రజలను కలిసి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. తనన గెలిపిస్తే డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా పనిచేస్తానని వివరించారు. ఆయా కాలనీల్లో సమస్యలను ఒక్కొక్కటి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే డివిజన్‌లో అవసరమైన అభివృద్ధి పనులను చేపడతామన్నారు. 41వ డివిజన్‌ను అందరి సహకారంతో అభివృద్ధి చేస్తామని ఇందిరా వినోద్ హామీ ఇచ్చారు. ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా సహకారం తీసుకుని డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. బీజేపీతోనే నగరంలోని అభివృద్ధి సాధ్యమని వివరించారు. బీజేపీ ప్రభుత్వం దేశంలోని పేదలకు ఎంతో మేలు చేస్తోందన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజల కోసం అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం మరింత అభివృద్ధి చెందుతోందని చెప్పారు.

గెలిపిస్తే.. వధువులకు పెళ్లి కానుక అందిస్తా..



అక్షరటుడే, ఇందూరు: తనను గెలిపిస్తే డివిజన్‌లోని పేద కుటుంబాలకు అండగా నిలుస్తానని నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 34వ డివిజన్ బీఆర్ఎస్ అభ్యర్థి నీత అర్జున్ రాథోడ్ హామీ ఇచ్చారు. డివిజన్‌లోని మిర్చి కాంపౌండ్, మార్వాడి గల్లీలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నీత అర్జున్ రాథోడ్ మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే డివిజన్‌లో పెళ్లి చేసుకోబోయే అమ్మాయిలకు పెళ్లికానుక అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రధానంగా వంట సామాగ్రి అందించి అన్నలా అండగా ఉంటానని చెప్పారు. అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వంలో అర్హులైన అందరికీ పెన్షన్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందించి ప్రజాభివృద్ధికి ఎంతగానో కృషి చేసిందని గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ మరింత అభివృద్ధి చేసి డివిజన్‌ను ఉత్తమంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. డివిజన్ వాసులు తమను ఎంతగానో ఆదరిస్తున్నారని గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

24వ డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటా..

అక్షరటుడే, ఇందూరు: తనను గెలిపిస్తే 24వ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థిని అంతిరెడ్డి గౌతమి నరేష్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు చంద్రనగర్‌లో బుధవారం ఆమె జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంతిరెడ్డి గౌతమి నరేష్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందికాబట్టి డివిజన్‌లోనూ అధికార పార్టీ అభ్యర్థి గెలిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఇప్పటికే అనేక పథకాలు అమల్లోకి వచ్చి పేద, మధ్యతరగతి ప్రజలకు లబ్ధి చేకూరుతోందన్నారు. 24వ డివిజన్‌లో తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, పారిశుధ్యం, వీధిదీపాలు వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే తన ప్రధాన లక్ష్యమని అంతిరెడ్డి గౌతమి నరేష్ రెడ్డి అన్నారు. అధికారంలో ఉన్న పార్టీకి ఓటు వేస్తే అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని ప్రజలకు విజ్ఞప్తి

చేశారు. రాబోయే ఎన్నికల్లో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో మేయర్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

బీజేపీ ఆధ్వర్యంలో 8వ డివిజన్‌ను అభివృద్ధి చేస్తాం

అక్షరటుడే, ఇందూరు : బీజేపీతోనే నగరాభివృద్ధి సాధ్యమని 8వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి మఠం పవన్ అన్నారు. సాయినగర్ లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మఠం పవన్ మాట్లాడుతూ.. ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కేంద్ర ప్రభుత్వ నిధులతో నగరంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి బీజేపీ నేతలు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఉన్న సమస్యలను ఇప్పటికే గుర్తించి, వాటి పరిష్కారానికి అహర్నిశలు శ్రమిస్తున్నానని పవన్ పేర్కొన్నారు. తనను గెలిపిస్తే ప్రజాసేవకు పూర్తిగా అంకితమవుతానని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తానన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల వల్ల ప్రజలకు విస్తృత లబ్ధి చేకూరుతోందని ఆయన తెలిపారు.



ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా పేదలకు పక్కా ఇళ్లు, ఉజ్వల యోజన కింద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందుతున్నాయని చెప్పారు. ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, రాబోయే ఎన్నికల్లో 8వ డివిజన్‌లో బీజేపీ విజయం సాధిస్తుందని మఠం పవన్ ధీమా వ్యక్తం చేశారు.

16వ డివిజన్‌ను అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్తాం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని.. తనను గెలిపిస్తే 16వ డివిజన్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని ఆ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిని పంచరెడ్డి అనిత సురేష్ తెలిపారు. బుధవారం డివిజన్ లోని దుబ్బ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లో అభ్యర్థిని పంచరెడ్డి అనిత సురేష్ ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో దేశవ్యాప్తంగా అభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. ఇప్పటికే అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలులోకి వచ్చి పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరుతోందని తెలిపారు. బీజేపీకి ఓటు వేస్తే అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా పేదలకు పక్కా ఇళ్లు అందుతున్నాయని పంచరెడ్డి అనిత సురేష్ వివరించారు. ఉజ్వల యోజన కింద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందించి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించిందని తెలిపారు. అలాగే ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సౌకర్యం లభిస్తోందని చెప్పారు. పీఎం

కిసాన్ పథకం ద్వారా రైతులకు ఆర్థికసాయం అందుతోందన్నారు. 16వ డివిజన్‌లో తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, పారిశుధ్యం, వీధిదీపాలు వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే తన ప్రధాన లక్ష్యమని అనిత సురేష్ తెలిపారు. ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, రాబోయే ఎన్నికల్లో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.